శేషాచలంలోకి పులుల ప్రవేశం?





ఇన్నాళ్లూ జాడలేని పులి శేషాచల అడవుల్లోకి అడుగుపెట్టిందా...? దీనికి అవుననే సమాధానం చెబుతున్నారు అటవీశాఖ అధికారులు. కడప జిల్లా చిట్వేలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాల్లో నమోదు కావడంతో ఈ అభిప్రాయానికి వస్తున్నారు. ఒకటి కాదు.. రెండో మూడో పులులు శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు నుంచి నల్లమల శేషాచలం కారిడార్ ద్వారా చిట్వేలి ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. ఇవి శేషాచలం అడవుల్లోకి కూడా అడుగుపెట్టి ఉంటాయని అంచనా వేస్తున్నారు.

జస్ట్.. సరదాగా పంచ్..

ఈ చిత్రంలో ఒకరు కలెక్టర్ వెంకటేశ్వర్ కాగా అటు తలపడుతున్న రెండో వ్యక్తి శాప్ ఛైర్మన్ రవినాయుడు. నిత్యం వివిధ కార్యక్రమాల్లో తీరిక లేకుండా గడిపే వీరికి బాక్సింగ్ ఆడటానికి సమయమెక్కడ దొరికిందనుకునుకుంటున్నారా.. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా సోమవారం ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్ హాలులో బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన వీరిద్దరూ బాక్సింగ్ పంచ్‌లు విసురుకుంటున్నట్లుగా సరదాగా కాసేపు ముచ్చటకలిగించారిలా..



మున్సిపల్ అదనపు కమిషనర్ రిలీవ్

తిరుపతి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డిని రిలీవ్ చేస్తూ కమిషనర్ మౌర్య సోమవారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. మాతృశాఖ స్టేట్ ఆడిట్ విభాగంలో రిపోర్ట్ చేయాలని అందులో పేర్కొన్నారు. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న చరణ్‌తేజ్ ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి ఏడీసీగా డిప్యుటేషన్‌పై వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా మాతృ సంస్థకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉన్నతాధికారుల అనుమతితో ఏడీసీగా కొనసాగుతూ వచ్చారు. సోమవారం మంత్రి నారాయణ రావడంతో పలువురు టీడీపీ నేతలు ఈ వ్యవహారాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు చరణ్‌తేజ్‌ను రిలీవ్ చేసినట్టు సమాచారం.

అధ్యక్ష పదవికి పోటాపోటీ

కొనసాగేందుకు ఆసక్తి చూపుతున్న నరసింహ యాదవ్

మార్చే పక్షంలో అవకాశం కోసం శ్రీధర వర్మ పట్టు

నేడు టీడీపీ పార్లమెంటు కమిటీపై సమావేశం

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీడీపీ పార్లమెంటు కమిటీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. వివిధ సమీకరణాలతో పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రేణిగుంట పైకన్వెన్షన్ హాలులో జరిగే టీడీపీ పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు నరసింహయాదవ్ మరోసారి అధ్యక్ష పదవిలో కొనసాగాలని భావిస్తున్నా గట్టిగా పట్టుబట్టడం లేదు. ఆయననే కొనసాగించాలని నిర్ణయిస్తే సమస్యే లేదు. మారిస్తే మాత్రం గట్టి పోటీ ఏర్పడుతుంది. నామినేటెడ్ పదవులేవీ లభించని మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఈ పదవి తనకు వస్తుందని నమ్ముతున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారు. అధ్యక్ష రేసులో ఉన్న అదే సామాజిక వర్గ సీనియర్ నేత సూరా సుధాకర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, గురవారెడ్డి(శ్రీకాళహస్తి), రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కూడా పోటీ పడుతున్నారు. కుల సమీకరణ లెక్కలు వేసుకుంటున్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు పేరు తెరపైకి వచ్చినా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్ష పదవి కేటాయించే అవకాశముందని సమాచారం.

సమతూకం పాటించాలి

పార్లమెంటు కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల పదవుల ఎంపికలో సామాజికవర్గాలు, నియోజకవర్గాలకు సమతూకం వేయాలని అధిష్టానం ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందంటున్నారు. అధ్యక్ష పదవి ఒక వర్గానికి ఇస్తే ప్రధాన కార్యదర్శి మరో వర్గానికి కేటాయించాల్సి ఉంటుంది. ప్రధాన పదవులను నియోజకవర్గానికి ఒకటి దక్కేలా జాగ్రత్త పాటించాలి. కమిటీలోనూ, అనుబంధ విభాగాల్లోనూ తప్పనిసరిగా యువత, మహిళలకు 33 శాతం వంతున పదవులు కేటాయించాలని భావిస్తున్న క్రమంలో వారి ప్రాతినిధ్యం పెరిగే అవకాశముంది. కాగా పదవికి కనీసం మూడు దరఖాస్తులు ఉండాలని అధిష్టానం త్రీ మెన్ కమిటీని ఆదేశించినట్టు చెబుతున్నారు. వచ్చే నెల 3వ తేదీలోపు కమిటీలు ఖరారు కావాలని నిర్ణయించిన నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు కమిటీపై ఈ నెలాఖరులోపే ప్రకటన వెలువడనుంది.

హాథీరాంజీ మఠం విషయంలో

కమిటీదే తుది నిర్ణయం



సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గాంధీరోడ్డులోని హాథీరాంజీ మఠం భవనం కూల్చివేతపై నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీదే తుది నిర్ణయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఈ విషయంపై సమీక్షించారు. భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించామని, పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లో పునర్నిర్మాణం, కూల్చివేతపై కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. మఠం పునరుద్ధరణ విషయంలో తిరుపతి ఐఐటీ నిపుణులకు లేఖ రాశామని, త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.

నూతన కమిటీ ఏర్పాటు

హాథీరాంజీ మఠం భవన సముదాయం కూల్చివేత, పునర్నిర్మాణంపై కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో నూతన కమిటీ ఏర్పడింది. ఇందులో నగరపాలక సంస్థ కమిషనర్, ఎమ్మెల్యే, ఐఐటీ ప్రతినిధులు, బంజార సంఘం ప్రతినిధులు, రాజకీయ పార్టీ నేతలు సభ్యులుగా ఉంటారు.

రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా స్విమ్స్ ఓపీ, ఓటీలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని, ప్రజలు, రోగులు సహకరించాలని కోరారు.

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి

ప్రశంసల జల్లు

● ఎన్‌పీఎం సేవలపై కేంద్ర బృందం కితాబు



కాన్పుల వార్డులో టీవీ ద్వారా వ్యాయామాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

శ్రీకాళహస్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిజేరియన్ కాన్పులను కట్టడి చేసే క్రమంలో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అందిస్తున్న సేవలపై కేంద్ర బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి నాగేంద్ర పర్యవేక్షణలో నర్స్ ప్రాక్టిషనరీ మిడ్‌వైఫ్(ఎన్‌పీఎం) సేవలందిస్తూ ఇక్కడి ప్రభుత్వాస్పత్రి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన కేంద్ర బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు సోమవారం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఇక్కడి ఎన్‌పీఎం విభాగం అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. ఓపీలో గర్భిణులకు చేస్తున్న ఎన్‌పీఎంలు పరీక్షలతోపాటు వ్యాయామాలు, మ్యూజిక్ థెరపీ, కౌన్సెలింగ్ ఇస్తున్న తీరుపై ఆరా తీశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ పద్ధతులు అమలు చేసేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూనిసెఫ్ ప్రతినిధి నాగేంద్ర మాట్లాడుతూ గర్భం దాల్చిన తొలిరోజుల్లో ఎన్‌పీఎం విభాగాన్ని ఆశ్రయిస్తే మూడు త్రైమాసికాల్లో వ్యాయామాలు, యోగాలకు సంబంధించి శిక్షణ ఇస్తారన్నారు. పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తూ సానుకూలమైన శస్త్రచికిత్స నిర్వహిస్తారన్నారు. అనవసర మందులు వాడకుండా, శాస్త్రీయ విధానాలతో సహజసిద్ధంగా హార్మోన్ల ఉత్పత్తి ద్వారా సుఖప్రసవం సునాయాసంగా జరిగేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మణిని ఆయన అభినందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ భారతీ శర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణా, రీసెర్చ్ అసోసియేట్లు మౌనిక, నీరల్ పటేల్, ఆస్పత్రి ఆర్ఎంవో విజయలక్ష్మి, సీనియర్ గైనకాలజిస్టు హరిప్రియ, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

మెగా సిటీగా తిరుపతి

స్కావెంజర్స్ కాలనీవాసులకు అక్కడే అపార్ట్‌మెంట్లు

జూన్‌లోపు తుడా టవర్స్ పూర్తి

మున్సిపల్, తుడా అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ




మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిని మెగా సిటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, ఇందులో భాగంగానే మహానగరం చేయాలని సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ, తుడా అభివృద్ధి పనులపై సోమవారం తుడా కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. తుడా టవర్స్‌లోని ఫ్లాట్లు, దుకాణాలపై వచ్చే ఆదాయ, వ్యయాలపై తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ శుభం బన్సల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నగరపాలక సంస్థలో పారిశుధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులపై కమిషనర్ ఎన్.మౌర్య వివరించారు. టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి తుడా ఆదాయాన్ని పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తుడా, నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. జూన్‌లోపు తుడా టవర్స్‌ను పూర్తిచేయాలని చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో స్కావెంజర్స్ కాలనీవాసుల పరిస్థితి చూసి ఎంతో బాధ కలిగిందని, వారికి 8 నెలల్లోనే అపార్టుమెంట్లు కట్టిస్తామని అన్నారు. తిరుపతి, తణుకులో టీడీఆర్ బాండ్ల జారీలో గోల్‌మాల్‌పై విచారణ జరుగుతోందన్నారు. కమిటీ ద్వారా పరిశీలించి అర్హులైన వారికి జారీ చేస్తున్నామన్నారు. శెట్టిపల్లి భూముల సమస్యను త్వరలోనే పరిష్కరించనున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, తుడా వీసీ శుభం బన్సల్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్, టీడీపీ నేతలు బీఎల్ సంజయ్, పుష్పావతి యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

పరమసముద్రం చెరువు చేరిన

కృష్ణా జలాలు



కుప్పం మండలం పరమసముద్రం చెరువు సమీపంలో పరవళ్లు తొక్కుతున్న హంద్రీ-నీవా కాలువ

కుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పంప్ హౌస్‌నుంచి విడుదలైన కృష్ణాజలాలు,ఈనెల23తేదీ అర్ధరాత్రికి రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించాయి. అక్కడినుంచి 24వ తేదీ మధ్యాహ్నానికి శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చేరుకున్నాయి. ఇక అక్కడినుంచి శాంతిపురం మండలం సోమాపురం ద్వారా గుడుపల్లె మండలం పాపానూరుకు, అక్కడినుంచి జరుగు గ్రామం ద్వారా సోమవారం మధ్యాహ్నానికి కుప్పం మండలంలోకి కృష్ణా జలాలు వడివడిగా ప్రవహించాయి. ఇదే రోజు రాత్రికి అంతిమ స్థానమైన కుప్పం చెరువుకు చేరడంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ సాగించిన 123.64 కిలోమీటర్ల ప్రయాణం ముగిసింది. ఇక నిండాల్సింది- కుప్పం, పలమనేరు నియోజకవర్గాల పరిధిలోని 110 చెరువులు మాత్రమే.

కుప్పంవాసుల కల నెరవేరింది : కుప్పం వాసుల చిరకాల కల నెరవేరిన సందర్భమిది. ఎక్కడి శ్రీశైలం ప్రాజెక్ట్.. ఎక్కడి కుప్పం... ఆరేడువందల కిలోమీటర్ల దూరంనుంచి కృష్ణమ్మ బిరాబిరా వచ్చి కుప్పం ఒడి చేరిన ఆనందం అన్నదాతది. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం సాకారమైంది. ఒక్క కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణానికే ఏకంగా రూ.560 కోట్లు వ్యయం చేశారు.ఇందులో వైసీపీ ప్రభుత్వంలో చేసింది నామమాత్రమే. అప్పట్లో నీళ్ల విడుదల చేసేశామంటూ జగన్ ఆడిన డ్రామాలు నవ్వులపాలయ్యాయి.2024లో అధికారంలోకి రాగానే ఎక్కడివక్కడ నిలిచిపోయిన హంద్రీ-నీవా కాలువ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి వేగం పెంచి అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తి చేయించి కుప్పానికి కృష్ణా జలాలను రప్పించగలిగారు.నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కాలువ గట్టు పొడవునా ప్రవహిస్తున్న గంగమ్మను చూస్తూ కేరింతలు కొడుతున్న కుప్పం అన్నదాతలోని ఆనందం ఎనలేనిది, వెలలేనిది కూడా.ముఖ్యమంత్రి చంద్రబాబు.. కుప్పం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో కృష్ణా జలాల ద్వారా వెలుగులు పూయించారు. వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేశారు. ఇది టీడీపీ నేతలు అంటున్న మాటలు కాదు. నియోజకవర్గంలో ఇప్పుడు ఏ పల్లెకు వెళ్లినా, ప్రజల నోళ్లలో నానుతున్న మాటలివి.

తుది దశకు డీఎస్సీ ప్రక్రియ

ఎల్లుండి నుంచి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

● నేటినుంచి కాల్ లెటర్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈనెల 22వ తేదీన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదలైన విషయం తెలిసిందే. ఈ జాబితా ఆధారంగా రాష్ట్ర విద్యాశాఖ సూచనలతో గురువారం నుంచి చిత్తూరులో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభిస్తారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి మెగా డీఎస్సీ-2025 లాగిన్ ఐడీల ద్వారా అభ్యర్థులు తమ కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి.. పరిశీలనకు 30 బృందాలు

అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. చిత్తూరులోని అపోలో, ఎస్వీసెట్ కళాశాలలను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు వేదికలుగా నిర్ణయించారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ సమయం, వేదికకు హాజరు కావాల్సి ఉంది. హాజరు కాని, అర్హత లేని అభ్యర్థిత్వం రద్దు చేయనున్నారు. అటువంటి సమయంలో తదుపరి మెరిట్ జాబితాలోని అభ్యర్థిని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవనున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు 30బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఎంఈవో, హెచ్‌ఎం,రెవెన్యూడీటీ, మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సిబ్బంది ఉంటారు.ఒక్కో బృందం కేవలం 50 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మాత్రమే చేస్తుంది. ఏ అభ్యర్థి, ఏ బృందం వారి వద్ద ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేసుకోవాలనే వివరాలు వారి మొబైల్‌కు రాష్ట్ర విద్యాశాఖ సమాచారం పంపుతుంది. ఈ బృందాల పర్యవేక్షణకు పది బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందంలో డిప్యూటీ డీఈవో, ఇద్దరు ఎంఈవో/హెచ్‌ఎంలు ఉంటారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థి పూర్తి సమాచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే జిల్లా విద్యాశాఖ లాగిన్‌కు పంపింది. కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావడం వల్ల అభ్యర్థికి ఎలాంటి ఎంపిక హక్కు కలుగదు. ఎంపిక పూర్తిగా మెరిట్, అర్హత, రిజర్వేషన్, నియమనిబంధనల ఆధారంగానే ఉంటుందని విద్యాశాఖ ప్రకటించింది. ఎవరైనా అభ్యర్థులు నకిలీ/తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించారని తేలితే క్రిమినల్ చర్యలుతీసుకునే అవకాశం ఉంది.

ధ్రువీకరణ పత్రాలిలా..

● అభ్యర్థులు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం, పోస్టుకు సంబంధించిన అర్హతల ఆధారంగా ఒరిజినల్ సర్టిఫికెట్లుతోపాటు అన్నీ స్కాన్‌కాపీలను తయారు చేసుకోవాలి. ● అప్లోడ్ చేసిన సర్టిఫికెట్ల అన్నీ మూడు సెట్ల జెరాక్స్ కాపీలను తీసుకుని గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకుని రావాలి ● ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను తేవాలి ● అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో అవసరమైన సర్టిఫికెట్ల స్కాన్ కాపీలను వెరిఫికేషన్ రాకముందే మెగా డీఎస్సీ 2025 లాగిన్‌లో అప్లోడ్ చేసి ఉండాలి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా రోస్టర్‌లో పోస్టుల మేనేజ్‌మెంట్ల వారీగా వివరాలు

కేటగిరీ	ప్రభుత్వ, స్థానిక యాజమాన్యం	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
ఓసీ	511	26	41	578
బీసీ-ఏ	94	6	11	111
బీసీ-బీ	127	5	7	139
బీసీ-సీ	18	1	0	19
బీసీ-డీ	91	5	6	102
బీసీ-ఈ	48	2	3	53
ఎస్సీ-గ్రేడ్ 1	16	1	4	21
ఎస్సీ-గ్రేడ్ 2	84	4	6	94
ఎస్సీ-గ్రేడ్ 3	102	4	6	112
ఎస్టీ	85	5	5	95
ఈడబ్ల్యూఎస్	125	5	8	138
పీహెచ్-విజువల్	1	0	0	1
పీహెచ్-హియరర్	10	0	0	10
ట్రైబల్‌వెల్ఫేర్ (ఆశ్రమ)	5	0	0	5
	1317	64	97	1478

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


రేషన్ కార్డు అందజేస్తున్న తహసీల్దారు భాగ్యలక్ష్మి

భాకరాపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రేషన్ కార్డులు పంపిణీని తహసీల్దారు భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్డుపై ముద్రించిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినట్లైతే కుటుంబసభ్యుల వివరాలు, పేరు, లింగం, వయస్సుతోపాటు కేటాయించిన రేషన్ పరిమాణం కనబడతాయన్నారు. మండలంలో 30 రేషన్ షాపులకు 8343 రేషన్ కార్డులు వచ్చాయన్నారు. ఎంపీడీవో గిడ్డయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి మదన మోహన, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కిశోర్, టీడీపీ నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. కేకేవీపురంలో స్మార్ట్ రేషన్‌కార్డు పంపిణీని ఆయన ప్రారంభించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దనచౌదరి పార్టీ జిల్లా కార్యదర్శులు ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, జేడీజగన్, సివిల్‌సప్లైస్ డీటీ యుగంధర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజులునాయక్,

తిరుపతి రూరల్ : మల్లంగుంట పంచాయతీలో సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్‌తోపాటు టీడీపీ రూరల్‌మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, పీఏసీ ఛైర్మన్ మధుశేఖర్,టీడీపీ నేతలు మునికృష్ణారెడ్డి, దిలీప్ కుమార్‌యాదవ్, కత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తహసీల్దార్ రామాంజులునాయక్ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రామాంజులునాయక్ మాట్లాడుతూ.. గ్రామసచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, రేషన్‌డీలర్లు కలసి గ్రామపంచాయతీల్లో ఈనెలాఖరువరకూ కార్డుల పంపిణీని చేపట్టాలన్నారు. మండలానికి 31,036కార్డులు వచ్చాయని, దీనికోసం 63మంది ఉద్యోగులను కేటాయించామన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

చంద్రగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 30 నుంచి మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెంది తెల్లరేషన్ కార్డు కలిగిన 19 నుండి 40 ఏళ్ల వయసున్న నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులు. కనీసం పదోతరగతి చదివి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలి. శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి కల్పిస్తారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లను అందజేస్తారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సురేష్ బాబు తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ పేమెంట్లతో భక్తుల ఇబ్బందులు



చంద్రగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో డిజిటల్ చెల్లింపుల విషయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 1 నుంచి క్యూఆర్ కోడ్ ద్వారానే సేవా టిక్కెట్లు కొనుగోలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. మంగళవారం స్వర్ణ పుష్పార్చన సేవ, బుధవారం అష్టోత్తర శతకళశాభిషేకం, గురువారం తిరుప్పావడ సేవలు నిర్వహిస్తారు. ఇందుకు ఇద్దరికి రూ.516 చెల్లించాలి. శుక్రవారం అభిషేకం ఒక్కరికి రూ.500, వస్త్రాలంకరణ సేవ ఇద్దరికి రూ.7 వేలు చెల్లించాలి. రోజూ కల్యాణోత్సవంలో పాల్గొనే ఇద్దరికి రూ.516 తీసుకుంటారు. సేవా టిక్కెట్ల కోసం వచ్చిన భక్తుల ఫోన్లలో కొందరికి డిజిటల్ సౌకర్యం లేకపోతే ఇబ్బంది పడుతున్నారు. అక్కడున్న వారికి నగదు ఇచ్చి కొనుగోలు చేయాల్సి వస్తోంది. రోజూ సుప్రభాతం, అర్చన, తోమాల సేవలకు నగదు చెల్లిస్తే టిక్కెట్లు ఇస్తున్నారు. డిజిటల్‌తో పాటు నగదు లావాదేవీలు కూడా అనుమతించాలని భక్తులు కోరుతున్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుబ్బారావు, పక్కన శ్రీనివాస్

తిరుపతిరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): వరి సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు ఆచరించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని డీఆర్సీ వ్యవసాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. సి.గొల్లపల్లెలో పీఎం-ఆర్‌కేవీవై పథకంలో భాగంగా సోమవారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన రకాల ఎంపిక, ఎరువులు, నీటి యాజమాన్యాన్ని వివరించారు. మండల వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ..పీఎం కిసాన్, ఈక్రాప్ బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్, పీఎండీ కిట్స్‌పై అవగాహన కల్పించారు ఈ-పంట నమోదుకు వచ్చేనెల15న చివరిగడువు అని తెలిపారు. ఏఈవో మహేష్, జానకిరామ్, వీఏఏ భవ్య పాల్గొన్నారు.

పద్య పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



రామచంద్రాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ పద్యం పరమార్థం తెలుసుకుంటే తెలుగు భాష ఔనత్యం అర్థమవుతుందన్నారు. పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చవితి వేడుకలు బాధ్యతగా నిర్వహించండి


మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

రామచంద్రాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద సరైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తహసీల్దారు మధుసూదన్‌రావు సూచింఆరు. సోమవారం వెలుగు కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవ కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మురళీమోహన్ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఊరిగింపు సమయంలో విద్యుత్ వైర్ల వద్ద సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజే ప్రోగ్రాం నిర్వహించకూడదన్నార్రు, శాంతిభద్రతలు కాపాడాలని కమిటీ సభ్యులను కోరారు.

రైతులకు యూరియా పంపిణీ


రైతులను అదుపు చేస్తున్న పోలీసులు

భాకరాపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పోలీసు బందోబస్తు మధ్య యూరియా రైతులకు పంపిణీ చేశారు. కొన్ని రోజులుగా యూరియా ప్రైవేటు షాపులు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది గ్రహించిన మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి ఉన్నతాధికారులతో మాట్లాడి గత నెలలో మూడు సార్లు 900 బస్తాల యూరియా తెప్పించి పంపిణీ చేశారు. అయినా చాలకపోవడంతో సోమవారం మళ్లీ 300 బస్తాలు యూరియా తెప్పించి పంపిణీ ప్రారంభించారు. రైతుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురుకావడంతో పోలీసుల సాయం తీసుకుని రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేశారు.

ఆలయంలో పూజల కలకలం

చంద్రగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనుప్పల్లి మార్గంలో మల్లయ్యపల్లె సమీపంలో ధనేశ్వరమ్మ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి పూజల ఘటన కలకలం రేపింది. అర్ధరాత్రి అనుప్పల్లి ఈ మార్గంలో ప్రయాణికులు వెళ్తుండగా ధనేశ్వరమ్మ ఆలయంలో కొందరు తలుపులు తెరిచి, లైట్లు వేసి, మంత్రాలు చదువుతున్నారు. దీంతో ప్రయాణికులు అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చేరుకుని పూజలు చేస్తున్న వారిని ప్రశ్నించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం సరిగాలేని క్రమంలో పూజలు చేస్తున్నామని వారు చెప్పారు. అర్ధరాత్రి పూజలు చేయడం సరికాదంటూ పోలీసులు పంపేశారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద జస్టిస్ హరిహరనాథశర్మ

తిరుచానూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని పలువురు ప్రముఖులు సోమవారం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉదయం దర్శించుకోగా మధ్యాహ్నం రాష్ట్ర హైకోర్టు జడ్జి హరిహరనాథశర్మ దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ రమేష్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు

తిరుమలలో శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వరాహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం వరాహజయంతి శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):శ్రీ కాళహస్తీశ్వరాల యంలో కొలువై ఉన్న మృ త్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్క రించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజ యుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కాలువలోకి దూసుకెళ్లిన టిప్పర్



వరదయ్యపాళెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. స్థానిక కంకర క్వారీల నుంచి కంకర తరలిస్తున్న టిప్పర్ సోమవారం వీకేఆర్‌వై కాలనీ సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి పక్కనే ఉన్న చెరువు కట్టవద్ద ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. టిప్పర్ ఖాళీగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఈ మార్గంలో తరచూ టిప్పర్లు అతివేగంతో అదుపు తప్పుతున్నాయి.

ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన కారు



తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులో సోమవారం ఓ కారు అదుపుతప్పింది. కోయంబత్తూరుకు చెందిన ఇద్దరు భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకుని తమ కారులో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో మార్గంలోని 12వ కిలోమీటరు వద్ద కారు అదుపుతప్పి కుడివైపు చిన్నపాటి గట్టుపైకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. కారు ముందు చక్రం విరిగిపోయింది. సమాచారంలో టీటీడీ ఆటోక్లినిక్ విభాగం కారును తొలగించి ట్రాఫిక్ చక్కదిద్దింది.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

వరదయ్యపాళెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబూరులో కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆల యం లో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వ హించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం స్వామి అమ్మ వార్లకు విశేష పూజలు నిర్వహించి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను చప్పరంపై అధిష్ఠింపజేసి గ్రామో త్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఎన్‌ఆర్‌ఐ నందకిషోర్ రెడ్డి పర్యవేక్షించారు.

అసంపూర్తి నిర్మాణంతో అగచాట్లు

●పుష్కర కాలంగా ఇదేతీరు ●అటవీశాఖ అభ్యంతరంతో ఆగిన రహదారి పనులు


రాళ్లు తేలి అధ్వానంగా తయారైన రోడ్డు

పాకాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పనులు ప్రారంభించి పుష్కర కాలమైనా బావిరాగన్న చెరువు రోడ్డు అసంపూర్తిగానే మిగిలింది. 2012 జనవరిలో నాబార్డు నిధులు రూ.2.08 కోట్లతో దామలచెరువు-నేండ్రగుంట రోడ్డు నుంచి బావిరాగన్న చెరువు మీదుగా పాకాల-గానుగపెంట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటి మంత్రి గల్లా అరుణకుమారి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆరు కిలో మీటర్ల మేర పనులు ప్రారంభమయ్యాయి. బావిరాగన్న చెరువు నుంచి గానుగపెంట రోడ్డు వరకు మొదట అర కిలోమీటరు మేర పనులు వేగంగా పూర్తి చేశారు. పాకాల - నేండ్రగుంట రోడ్డు నుంచి అర కిలోమీటరు పనులు సాగాక ఓ కిలోమీటరుకు పైగా రిజర్వు ఫారెస్టులో రోడ్డు వేయడానికి అటవీశాఖ అభ్యంతరంతో తెలిపింది. దీంతో పనులు ఆగిపోయాయి. మెటల్ రోడ్డు వేశారు. తారురోడ్డు వేయకపోవడంతో మెటల్ రోడ్డు వర్షాలకు కోట్టుకుపోయి రాళ్లు తేలిపోయాయి. అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో నిధులు మురిగిపోయాయి. రోడ్డు పూర్తి కాకపోవడంతో బావిరాగన్న చెరువు గ్రామస్థులు పాకాల-గానుగపెంట రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లాల్సివస్తోంది.

రెండు కిలోమీటర్లకు బదులు ఆరు కిలోమీటర్లు చుట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. ఈ రోడ్డు పనులు పూర్తయితే గానుగపెంట, మద్దినాయనిపల్లె పరిసర గ్రామాల ప్రజలు సులభతరంగా ప్రయాణించేందుకు అవకాశముంటుంది. రహదారులు, భవనాల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటు అటవీ శాఖ అనుమతులు వస్తాయని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. అసంపూర్తిగా వున్న పనులు పూర్తిచేయాలని వీరు కోరుతున్నారు.

పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ : నాని


స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాలలో పారదర్శకంగా నిత్యావసర సరుకులు లబ్దిదారులకు పంపిణీ చేయడానికి స్మార్ట్ రైస్ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. పాకాల పంచాయతీ గుట్టకింద ఇండ్లులో సోమవారం లబ్దిదారులకు ఈ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రైస్ కార్డులోని క్యూ ఆర్‌కోడ్ స్కాన్ చేసి సరకులు తెచ్చుకోవచ్చన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కార్డుల వలంల సరుకులు పక్కదోవపట్టే అవకాశం లేదన్నారు. మండలంలోని 41 చౌక దుకాణాల పరిధిలో 15,693 కార్డులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో శశిరేఖ, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, జనసేన కన్వీనర్ తలారి గురునాథ్, టీడీపీ నాయకులు కె.సావిత్రి, కె.సుధాకరయ్య, డేవిడ్ సురేష్, రావిళ్ల మోహన్, చాముండేశ్వరి, డి.మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల: తిరుమల స్థానికులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తిరుమల టీడీపీ అధ్యక్షుడు సుద్దల రాజు యాదవ్ ఆధ్వర్యంలో కమ్యూనిటిహాల్‌లో 153 మందికి వీటిని అందజేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి శివషణ్ముగం పాల్గొన్నారు.

పట్టుబడ్డ ఏటీఎం కార్డుల దొంగ

సత్యవేడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం సెంటర్‌కు వచ్చే వినియోగదారులను ఏమార్చి కార్డులు చోరీ చేస్తున్న దొంగ ను సత్యవేడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాలు.. ఎకన్నవరానికి చెందిన రవి ఈనెల 18న సత్యవేడు ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం సెంటర్‌కు నగదు డ్రా చేసుకు నేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అక్కడ గుర్తు తెలియని వ్యక్తిని సాయం అడిగి నగదు డ్రా చేసుకున్నాడు. సాయంత్రానికి అకౌంట్ నుంచి తన ప్రమేయం లేకుండా డబ్బు డ్రా అవుతున్న విషయాన్ని గుర్తించి మోసపోయానని గ్రహించాడు. తన ఏటీఎం కార్డును ఆ గుర్తు తెలియనివ్యక్తి దొంగిలించాడని గ్రహించి లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ మురళి ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు నిందితుడి కోసం గాలించాయి. దొంగిలించిన ఏటీఎంతో నిందితుడు చిత్తూరులోని ఓ ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేశాడని రవి ఫోన్‌కు మెసేజ్ రావడంతో అక్కడకు చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దాని ఆధారంగా నిందితుడు ఏర్పేడు మండలం కందాడు గ్రామానికి చెందిన మునిసుబ్రమణ్యం (40)గా గుర్తించి అదుపులో తీసుకున్నారు. విచారణలో నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా నిందితుడు మునిసుబ్రమణ్యం బీటెక్ వరకు చదువుకుని ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇతనిపై శ్రీకాళహస్తి, ఏర్పేడు, గాజులమండ్యం, వడమాలపేట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనాయి. ఏఎస్‌ఐ చంద్రశేఖర్, ప్రతాప్, హరి, హనుమంతయ్య పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు?

వింగ్ టెక్ పరిశ్రమ ముందు కార్మికుల ధర్నా



రేణిగుంట/ ఏర్పేడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వింగ్ టెక్ పరిశ్రమ ముందు కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. సోమవారం ఉదయం విమానాశ్రయం సమీపంలోని కార్బన్ పరిశ్రమ అనుబంధ సంస్థ వింగ్‌టెక్‌లో పనిచేస్తున్న కార్మికులు ప్రధాన ద్వారం వద్ద యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాజమాన్యం మారడంతో 205 మందిని తొలగిస్తున్నామనడం భావ్యం కాదన్నారు. వింగ్‌టెక్ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మికులు సోమవారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. నోటీసులు ఇవ్వకుండా కార్మికులను తొలగించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. వింగ్ టెక్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. చైనాకు చెందిన వింగ్ టెక్ యాజమాన్యం ఆరేళ్ల కిందట ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదని, ప్రకటించిన పెట్టుబడులు పెట్టకపోగా రాయితీలు పొందిందన్నారు. లాభాలు గడించినప్పటికీ పన్నులు చెల్లించకుండా కార్మికులకు తొలగించిందని పేర్కొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఖాళీ

కానరాని అధికారులు, సిబ్బంది



తడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించే ఎంపీడీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది లేక బోసిపోతోంది. ఎంపీడీవో శిక్షణ నిమిత్తం బాపట్లకు వెళ్లగా, ఏవో సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఆరు నెలలుగా అక్కడే ఉన్నారు. ఇక ఈవోపీఆర్‌డీ అనారోగ్య కారణంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఇక కార్యాలయంలో ఉన్నది కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే. ఇలా అధికారు లంతా దూరంగా ఉండటంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎవరూ కాన రావడంలేదు. ఈ పరిస్థితిని గుర్తించిన జిల్లా అధికారులు నాయుడుపేట ఎంపీడీవో సురేష్‌బాబును తడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఒక్కనాడైనా ఈ కార్యాలయ ముఖమే చూడలేదు. ఏదైనా ముఖ్యమైన ఫైళ్ల క్లియరెన్స్ అవసరమైతే ఇక్కడ పనిచేసే అటెండర్ నాయుడుపేటకు తీసుకువెళ్తున్నారు.


టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ జన్మదినం సందర్భంగా సోమవారం తిరుపతిలోని కృష్ణాపురం ఠానా దగ్గర నిర్వహించిన అన్నదానం

మున్సిపల్ భవనాన్ని పూర్తిచేయండి

● మంత్రిని కోరిన డిప్యూటీ మేయర్

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిధులు లేక నిలిచిపోయిన మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. సోమవారం తుడా కార్యాలయంలో జరిగిన సమీక్షలో మంత్రి నారాయణను సన్మానించారు. కార్పొరేషన్ కార్యాలయంలేక అటు ప్రజలకు, ఇటు యంత్రాంగానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఆస్పత్రి భవనంలో కార్యాలయం, యూనివర్సిటీలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని, అన్యాక్రాంతంగా ఉన్న మున్సిపల్ స్థలాన్ని అమ్మి అయినా నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ నిర్మాణాలకు ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేదని, ఏదోఒక నిర్ణయం తీసుకుని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

మంగళం పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



తిరుపతి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాలైన సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్, శెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శులు మురళి, శశిభూషణ్, మనోజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో క్యూఆర్‌కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సరుడు చోరీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ మహిళ సరుడు చోరీకి గురైనంది. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలో నివాసం ఉంటున్న నాగభూషణమ్మ సోమవారం సూళ్లూరుపేట వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ఆమె మెడలో ఉన్న రెండు సవర్ల సరుడు ఎవరో అపహరించారు. బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

వాకాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అశోకపిల్లర్ వద్ద ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనం తరం ఏఎంసీ ఛైర్మన్‌గా మర్రి ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా దువ్వూరు మధు సూదనరెడ్డి, పాలకవర్గ సభ్యులు సిద్ధప్పరెడ్డి పోలమ్మ, పంత్రాంగం వసంత్, బత్తిన ప్రమీల, చల్లా స్వాతి, మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, వంకా శ్రీజ, బసవ నూరు భాస్కర్, అయనబోలరి యామినీ, విన్నమాల మంజుల, కల్లూరు క్రాంతి, షేక్ మస్తాన్‌బాషా, దొడ్డగ వెంకటరమణ, యల్లబోతు రాజగోపాల్ రెడ్డి చేత ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, కోట మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో గణపర్తి కిషోర్‌నాయుడు, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, మధుయాదవ్, దారా సురేష్, రౌతు శివకుమార్, పామాంజి కృష్ణయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చవితి ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు నగరం ముస్తాబు ● ఆయా ప్రాంతాలకు తరలుతున్న గణనాథులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలకు ఒక రోజే ఉండడంతో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని ఆయా ప్రాంతాల్లో వినాయక ప్రతిమల ఏర్పాటుకు మండపాలను సిద్ధం చేశారు. ఆలయాలకు రంగులద్ది, పందిళ్లు వేశారు. విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. గతేడాది అధికారికంగా 670 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయగా అనధికారికంగా మరో వందకుపైగానే వెలిశాయి. ఇప్పుడా సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నగర వినాయక కమిటీకి అనుమతుల కోసం రెండు రోజుల్లో మూడు వందలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక రోజే సమయం ఉండడంతో మరిన్ని వచ్చే అవకాశముంది. అలాగే అనధికారికంగా చిన్నపాటి సందుల్లో ప్రతిమలు కొలువుదీర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు టీటీడీ అనుబంధ కపిలేశ్వరాలయం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయాల్లోనూ చవితి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాతాయ్యగుంట గంగమ్మ ఆలయంలోని వినాయకుని గుడిలోనూ ఏర్పాట్లు సాగుతున్నాయి.


గోవిందరాజస్వామి పుష్కరిణి ముందు సిద్ధమైన మండపం

మండపాలకు తరలుతున్న వినాయక ప్రతిమలు

నగరంలోని ఆయా ప్రాంతాలకు బొమ్మల క్వార్టర్స్ నుంచి వినాయక ప్రతిమలు తరలుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల మండపాల్లో ప్రతిమలను చేర్చి ముసుగులు తొడిగి ఉంచారు. మిగిలిన ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోపక్క మట్టి వినాయక ప్రతిమల విక్రయాలు కూడా సాగుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మట్టి వినాయకుల పంపిణీకి సిద్ధం చేస్తున్నారు.

నిమజ్జనానికి సిద్ధం

చవితి వేడుకల అనంతరం వినాయక ప్రతిమల నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనానికి చవితి రోజుతోపాటు మూడో రోజు, తొమ్మిదో రోజు ముహూర్తంగా నిర్ణయించారు. వినాయకసాగర్‌లో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మూడు చిన్న, ఒక పెద్ద క్రేన్లు అందుబాటులో ఉంచనున్నారు. 25 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతున్నారు. బోటింగ్‌తోపాటు టీటీడీ ఆధ్వర్యంలో తెప్పలనూ ఏర్పాటు చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉంటారు. అలాగే చెన్నాయగుంట, గొల్లపూడి చెరువు, కరకంబాడి చెరువు, దామినేడు చెరువుల వద్ద కూడా నిమజ్జన కార్యక్రమం ఉంటుంది. ఇక్కడ కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.


సున్నపువీధిలో..


దొడ్డాపురం వీధిలో మండపం ఏర్పాట్లు


వాహనంలోకి వినాయక ప్రతిమను ఎక్కిస్తున్న యువకులు


వినాయకసాగర్‌లో నిమజ్జనానికి సిద్ధమైన కొలను

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక తాతానగర్‌లోని నేరేళ్లమ్మ ఆలయం వద్ద ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా మట్టి వినాయకు ప్రతిమలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజించడం పర్యావరణహితమని అన్నారు. అనంతరం సుమారు 500 మందికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రతినిధి ప్రతాప్ స్వామీజి, హనుమంతరావు, కేఎన్‌రాజా, దీప, ధనంజయరెడ్డి, కప్పా పద్మనాభం, పొన్నాల జేజిరెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆటో బాబు, చెంగల్ రాయులు పాల్గొన్నారు.

కార్గో సెంటర్ తరలింపు


నూతన కార్గో సెంటర్‌లో పూజలు చేస్తున్న డీపీటీవో, అధికారులు, సిబ్బంది

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌లోని శ్రీహరి బస్టాండులో కొంత భాగం మరమ్మతుల కారణంగా 1నుంచి 5వరకు ప్లాట్‌ఫామ్స్ కూల్చివేయనుండడంతో ఆర్టీసీ కార్గో కేంద్రాన్ని మరో రెండు ప్రాంతాలకు తరలించారు. ఏడుకొండల బస్టాండు వద్ద టీటీడీ కౌంటర్‌లో పార్శిల్స్ డెలివరి, డీపీటీవో కార్యాలయం కింద ఉన్న దుకాణం గదుల్లో పార్శిల్స్ బుకింగ్ కౌంటర్లను సోమవారం డీపీటీవో జగదీష్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. కస్టమర్లు ఈ మార్పులను గమనించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బస్టాండు ఏటీఎం భాస్కర్, కార్గో విభాగం సిబ్బంది పురుషోత్తం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి


బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు సోమవారం తిరుపతిలో నిర్వహించారు. స్థానిక డీబీఆర్ రోడ్డులోని మండల్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం బీపీ మండల్ సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, చంద్రబాబుయాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, బీసీ సంఘర్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

22ఏ నుంచి రాఘవేంద్రనగర్‌ను విడుదల చేయండి

● దేవదాయశాఖ కమిషనర్‌కు వినతి


దేవదాయశాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేత శ్రీహరి నాయుడు

తిరుపతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాఘవేంద్ర నగర్‌ను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌ను టీడీపీ సీనియర్ నేత మేడికొండ శ్రీహరి నాయుడు కోరారు. ఆమేరకు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన సిఫారసు లేఖలతో విజయవాడకు వెళ్లి కమిషనర్‌ను కలిశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాఘవేంద్ర నగర్‌ను 22ఏ జాబితాలో చేర్చారని, క్రయ, విక్రయాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. హథిరాంజీ మఠం భూములను చట్టప్రకారం కౌలు రైతుల దగ్గర నుంచి కొనుగోలుచేసి వాటిని రిజిస్ట్రేషన్ చేసియున్నారన్నారు. ఈక్రమంలో బ్యాంకు రుణాలు కూడా పొందడం జరిగిందన్నారు. వాటిని పునరుద్ధరించాలని శ్రీహరి నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

టీడీపీ నేత మనోహరాచారి మృతి


మనోహరాచారి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శి చేజర్ల మనోహరాచారి సోమవారం మృతిచెందారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సుందరయ్యనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల టీడీపీ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ నేతలు సుగుణమ్మ, పనబాక లక్ష్మి, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, రవినాయుడు, మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, యశ్వంత్ రెడ్డి తదితరులు ఆయన భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. పార్టీకి ఆయనలేని లోటు తీరనిదని సేవలను గుర్తుచేసుకున్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురండి


చైర్మన్ వైఎస్ బాబును సత్కరిస్తున్న వైస్ చైర్మన్ ఎస్ఎండీ గౌస్

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఐదు బ్రాంచ్‌ల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలు ఉంటే నూతన కమిటీ నాయకుల దృష్టికి తీసుకురావాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు బీఎం బాషా అన్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన బీఈసీ సమావేశంలో ఆయన మాట్లడుతూ రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఐదు వేరువేరు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న లోకో అండ్ టెక్నికల్ ఉద్యోగులను కలిపి కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీ సభ్యులకు సమస్యలను తెలితే వారు ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. అనంతరం గుంతకల్లు డివిజన్ ఇన్ చార్జ్ సీనియర్ డీపీవో, హెచ్.ఎల్.ఎన్. ప్రసాద్ ప్రకటించిన నూతన కమిటీ జాబితాను ఆయన సమావేశంలో వెల్లడించారు. కమిటీ చైర్మన్‌గా వై.ఎస్.బాబు, వైస్ చైర్మన్లుగా ఎం.శ్రీనివాసులు, ఎస్.ఎండీ.గౌస్, ఎ.లక్ష్మీనారాయణ, సుజిత్‌కుమార్, కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా కె.సుబ్రమణ్యం, శశికాంత్, బి.శ్యామ్‌కుమార్‌లు, కోశాధికారిగా పి.ఎస్.రాజేష్, సభ్యులుగా ఎస్.కె.కరీముల్లా, సి.రంగయ్య, చంద్రమౌళి, డి.చక్రవర్తి, ఆర్.లక్ష్మీప్రసాద్‌లను నియమించినట్లు చెప్పారు. ఈ కమిటీని జోనల్, డివిజన్ స్థాయి అధికారులకు గుర్తింపు లభించిందని అన్నారు. అనంతరం నూతన కమిటీని పలువురు సభ్యులు, ఉద్యోగులు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

సైనికులు దేశగౌరవాన్ని పెంచారు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



తిరుమల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనికులు, భద్రతాసిబ్బంది వీరోచితమైన ప్రదర్శన చేసి దేశ గౌరవాన్ని పెంచారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం సుప్రభాత సేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.దేశపరిరక్షణలో అంకితభావంతో పనిచేస్తున్న సైనికులకు అండగా ఉండాలని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు.

కోలా ఆనంద్‌కు సన్మానం


కోలా ఆనంద్‌ను సత్కరిస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కోలా ఆనంద్‌ను తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఘనంగా సత్కరించారు. సోమవారం శ్రీకాళహస్తిలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో పాటు వివేకానందుడి చిత్రపటాన్ని బహూకరించారు. శ్రీవారితో పాటు ముక్కంటి ఆశీస్సులతో మరిన్ని పదవులు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నాగ ప్రతాప్, రవితేజ నాయుడు, హేమంత్, నాగరాజు పాల్గొన్నారు.

మలేషియాలో తెలుగు కళాకారుల నృత్యప్రదర్శన


మలేషియాలోని తెలుగు సంఘం సభ్యులతో నృత్య కళాకారులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మలేషియా తెలుగు సంఘం క్లాంగ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భరతనాట్య ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుంచి మొత్తం 24 మంది కళాకారులు పాల్గొన్నారు. గాయకుడు అప్పారావు ఎంపిక చేసిన పాటలకు కళాకారులిచ్చిన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ నృత్య ప్రదర్శనను రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారి విజయరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మలేషియాలో తెలుగు వారి సంక్షేమానికి డాక్టర్ పైడి అంకయ్య చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. పైడి అంకయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మలేషియా తెలుగు సంఘం క్లాంగ్ శాఖ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రామచంద్ర, లక్ష్మి, హిమబిందు పాల్గొన్నారు.

రేషన్ పారదర్శక పంపిణీ కోసమే స్మార్ట్‌కార్డులు

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను పారదర్శకంగా అందించేందుకే స్మార్ట్‌కార్డులను ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన సరికొత్త స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం ఉదయం ఎమ్మెల్యే తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో మొత్తం 66,243 స్మార్ట్ రేషన్‌కార్డులు ఉన్నాయని, 102 చౌక దుకాణాల ద్వారా వాటిని త్వరితగతిన లబ్ధిదారులకు చేరవేస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల నమోదు నిరంతరం ప్రక్రియ అన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం కొత్త కార్డులు మంజూరు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెట్టిందన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించి పేదల పొట్టకొట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎన్డీఏ నేతలు వూకా విజయ్‌కుమార్, కుమారమ్మ, ఆర్సీ మునికృష్ణ, రాజారెడ్డి, మహేష్‌యాదవ్, దంపూరి భాస్కర్, పుష్పావతి, తదిరులు పాల్గొన్నారు.

ఇందిరా ప్రియదర్శిని మార్కెట్‌లో దొంగలున్నారు జాగ్రత్త...!

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో దొంగలు అందినకాడికి దోచుకొంటున్నారు. డబ్బులు, సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు లబోదిబోమంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేలాదిమంది ప్రజలు మార్కెట్‌కు వచ్చి కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తుంటారు. ఈ సమయంలో చోరులు తమకందిన సెల్‌ఫోన్‌లు, డబ్బులు తస్కరించుకొని వెళుతున్నారు. ఆదివారం ఒక్కరోజే మూడు సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు బాధితులు తెలిపారు. ఇక డబ్బులు పోగొట్టుకున్న వారు ఎంత మంది ఉంటారో తెలియడంలేదు. పోలీసు అధికారులు స్పందించి నిఘా సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు

తిరుపతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన వస్తువులకోసం పిలిచిన టెండర్‌ను చివరిదశలో రద్దుచేయాలనుకోవడాన్ని విరమించుకోవాలని కాంట్రాక్టర్ గోవర్ధన్ బాబు వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసపురంలో వీధి దీపాలు వెలగడం లేదని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నా ప్రైవేట్ స్కూల్‌లో పేరు వస్తోంది.. సరి చేయించాలని, రాయలవారివీధి, శ్రీనగర్‌లో తరచూ యూడీస్ బ్లాక్ అవుతోంది.. మరమ్మతులు చేయాలని, హమీద్‌నగర్‌లోని ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించాలని, కొత్తపల్లిలో సీసీ రోడ్లు వేసి, తాగునీరు సరఫరా చేయాలని, వికలాంగ పింఛన్లు ఇప్పించాలని, ఐఎస్‌మహల్ సమీపంలో రోడ్లపై చెత్త వేస్తున్నారని, మా స్థలంలో కంచి రాము అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నాడు.. అడ్డుకోవాలని, బృందావన్ అపార్ట్మెంట్, అమరరాజా అపార్ట్మెంట్ వారు యూడీస్ నీరు పొలాల్లోకి వదిలేశారు.. సరి చేయించాలని, ఆటోనగర్ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తున్నారు.. అడ్డు కోవాలని కోరారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు అదనపు కమిషనర్ తెలిపారు.

ఎస్బీ హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

● విచారణకు వెళ్లిన ఎస్ఐపైనా దౌర్జన్యం... దూషణలు
● నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఒక ఫ్రైడ్ రైస్ సెంటర్ యాజమాన్యం తిరుపతి ఈస్ట్‌లో పనిచేస్తున్న ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్‌రావుపై ఆదివారం రాత్రి దాడి చేసి చితకబాదారు. విషయం తెలిసి విచారణ కోసం వెళ్లిన ఎస్ఐని సైతం దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేసిన ఘటన స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రామ్మోహన్‌రావు ఆదివారం రాత్రి తన కుమార్తెను తీసుకుని ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఫైవ్ స్టార్ ఫ్రైడ్ చికెన్ సెంటర్ వద్దకు వెళ్లి చికెన్ పీసులు కావాలని అడిగారు. దీనికి సంబంధించి బిల్లు కూడా చెల్లించారు. అయితే పార్శిల్ ఇచ్చే సమయంలో చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న చైతన్య అనే వ్యక్తి అడిగిన చికెన్ ఫ్రైడ్ ముక్కలు కాకుండా వేరే ముక్కలు ఇచ్చాడు. దీన్ని గమనించిన రామ్మోహన్‌రావు తాము అడిగిన పార్శిల్ కాకుండా వేరే ఎందుకు ఇస్తావని ప్రశ్నించాడు. దీనిపై చైతన్య నానా మాటలతో అతడిని దూషించి దౌర్జన్యం చేశాడు. ఇంతలో అక్కడే వున్న ఫ్రైడ్ రైస్ హోటల్ నిర్వాహకురాలు లావణ్య కలుగచేసుకుని రామ్మోహన్‌రావును దూషించి, దాడికి దిగే ప్రయత్నం చేసింది. జరిగిన విషయాన్ని ఆమె భర్త కిషోర్, అన్న మనోజ్‌లకు ఫోన్ ద్వారా తెలియచేసింది. దీంతో వారిద్దరూ ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని రామ్మోహన్‌రావు చెంపపై కొట్టారు. అనంతరం దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో అతడి ముఖం, కన్నుపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు చెప్పడంతో ఆగమేఘాలపై ఎస్ఐ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ఎస్ఐని చూసి మళ్లీ లావణ్య, ఆమె భర్త కిషోర్, అన్న మనోజ్‌లు రెచ్చిపోయి దుర్భాషలాడారు. ఘటన చేయి దాటిపోతుందని తెలిసి అదనపు బలగాలను అక్కడకు రప్పించారు. దీంతో పాటు ఎస్ఐ హేమాద్రి, హెడ్ కానిస్టేబుల్ జ్యోతినాథ్‌లు అక్కడకు చేరుకుని దాడిచేసి, దుర్భాషలాడిన కిషోర్, మనోజ్, చైతన్యలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేశారు. లావణ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఫ్రైడ్ చికెన్ సెంటర్‌లో వున్న సీసీ పుటేజీలు పోలీసులకు చిక్కకుండా ముందు జాగ్రత్తగా డీవీఆర్‌ను సైతం తొలగించారు. జరిగిన ఘటనపై విచారణ చేస్తున్న సీఐ శ్రీనివాసులు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వైసీపీ నేతలకు మతిభ్రమిస్తోంది

● ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ

తిరుపతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి తట్టుకోలేక వైసీపీ నేతలకు మతిభ్రమించి టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ అన్నారు. సింగాలగుంటలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను ఆమె పంపిణీ చేశారు. అనంతరం తన నివాసంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి ప్రతిరోజు టీటీడీపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వారి మాటలను తిరుపతి ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

● 35వ డివిజన్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

35వ డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, రవితేజ నాయుడు, మధు, రాము, రూపేష్, జగన్నాథం, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

సిటీ విజిటర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ యాప్ ప్రారంభం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు రూపొందించిన సిటీ విజిటర్ ఇన్ఫర్మేషన్ రికార్డు మేనేజ్‌మెంటు సిస్టమ్ (స్విరిమ్స్) యాప్‌ను సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన రాజు ఆవిష్కరించారు. దీనిద్వారా తిరుపతికి రోజుకు ఎంతమంది వస్తున్నారు? ఎక్కడ దిగుతున్నారు అనే వివరాలు తెలుస్తాయన్నారు. హోటళ్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నామని, యాత్రికుల ఆధార్ కార్డు, అడ్రస్‌లు, లైవ్ ఫొటోలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల పూర్తి వివరాలు సేకరిస్తామని అన్నారు. ఇలా చేయడం వల్ల అసాంఘిక శక్తులను సులువుగా గుర్తించగలుగుతామని తెలిపారు.



యాప్ గురించి వివరిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు


మంత్రి నారాయణ - జస్టిస్ సందేశ్ - జస్టిస్ జోషి - జస్టిస్ ఎంకె థక్కర్ - జయం రవి - మాధవి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులు, తమిళ సినీ హీరో జయం రవి(రవిమోహన్), గాయని కెనిషా ఫ్రాన్సిస్, చిరంజీవి సోదరి మాధవి ఉన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హెచ్‌పీ సందేశ్, జస్టిస్ సీఎం జోషి, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే థక్కర్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

సర్వ దర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం : రూ.4.02 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,119

తలనీలాలు సమర్పించినవారు : 25,294

మేము దివ్యాంగులమే..పెన్షన్ రద్దు చేయకండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు పోటెత్తిన ప్రత్యేక ప్రతిభావంతులు - ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'మేమంతా దివ్యాంగులమే.. కొంతమంది నడవలేని స్థితిలో ఉన్నారు.. మరి కొందరు కదల్లేని స్థితిలో ఉన్నారు.. వందశాతం వికలత్వం ఉన్నా 40 శాతానికి తగ్గించి పింఛన్లు రద్దు చేస్తామంటూ నోటీసులు పంపారు. మా కడుపు కొట్టకండి' అంటూ పలువురు దివ్యాంగులు కలెక్టర్ వెంకటేశ్వర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు దివ్యాంగులు పెద్దయెత్తున రావడంతో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా వైద్యశాఖాధికారి బాలకృష్ణనాయక్ వారినుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 321 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 151 ఉన్నాయి.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రీ వెరిఫికేషన్‌లో అన్యాయం చేశారు



ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. మంచానికే పరిమితమయ్యా. ఇటీవల మా ఇంటికి వైద్యబృందం వచ్చి 89శాతం ఉన్న వికలత్వాన్ని 49శాతం మాత్రమే ఉందని రాశారు. దీంతో రూ.15వేలు వచ్చే పింఛను రూ.6వేలు చేశారు. వైద్యబృందం అన్యాయం చేసింది.. మీరైనా న్యాయం చేయండి.

- కార్తికేష్, నారాయణవనం

నా భూమిని వేరేవారి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు



వంశపారంపర్యంగా ఆలత్తూరు రెవెన్యూ లెక్కదాఖల్లో 2.60ఎకరాలు కలిగి ఉన్నాను. ఈ భూమిని వీఆర్వో, రెవెన్యూ అధికారులు నాకు తెలియకుండా వేరే ఇద్దరి పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనిపై రెవెన్యూ సదస్సులోనూ ఫిర్యాదు చేశాను. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. మీరైనా న్యాయం చేయండి.

- చెంగారెడ్డి, ఆలత్తూరు, బీఎన్‌కండ్రిగ

వికలత్వం తక్కువగా ఉందని పింఛను తొలగిస్తామన్నారు..



ఎన్నో ఏళ్లుగా నడవలేని స్థితిలో ఉన్నాను. రూ.6వేలు పింఛను వచ్చేది. రీ వెరిఫికేషన్ పేరుతో వికలత్వాన్ని 40శాతం కంటే తక్కువగా చేయడంతో పింఛను తొలగించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పింఛను రద్దు చేయడం దుర్మార్గం. పునఃపరిశీలన చేయండి.

- లక్ష్మీనారాయణ, దివ్యాంగుడు, సప్తగిరికాలనీ, మంగళం

తొలగించిన పింఛన్లను పునరుద్ధరించండి


కలెక్టరేట్ ఎదుట వికలాంగుల ఆందోళన

తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లు తొలగించి వారి గొంతుకోసే ప్రయత్నం చేస్తోందన్నారు. తిరుపతి జిల్లాలో రీవెరిఫికేషన్ పేరుతో 25వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రీవెరిఫికేషన్ పేరుతో తప్పుడు ధృవపత్రాలు ఇచ్చిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

చిన్నతనంలోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి



పోలియో కారణంగా చిన్నపుడే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. రూ.70 నుంచి పింఛను అందుకుంటున్నాను. 90శాతం వైకల్యం ఉన్నా వైద్యులు రీవెరిఫికేషన్ పేరుతో వికలత్వం తగ్గించారు. ఇలా చేయడం సబబుకాదు. పునఃపరిశీలించి పింఛను అందజేయాలి.

- శ్రీనివాసులు, తిరుపతి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయాలని విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని తెలిపారు. తిరుపతి, చంద్రగిరిలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.




హెల్ప్‌డెస్క్‌లో దివ్యాంగులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

వింగ్‌టెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

వింగ్‌టెక్ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. చైనాకు చెందిన వింగ్‌టెక్ యాజమాన్యం ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి భిన్నంగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో రాయితీలు పొంది ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు, పన్నులు చెల్లించకపోగా కార్మికులకు ద్రోహం చేస్తోందని వివరించారు. ఈ మేరకు కలెక్టర్‌కు విన్నవించారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని ఏపీ రజకవృత్తిదారుల సంఘం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంఘ నాయకులు కోరారు.


ఆందోళన చేస్తున్న వింగ్‌టెక్ పరిశ్రమ ఉద్యోగులు

ఏడు ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సోమవారం తెల్లవారుజామున ఎల్లమంద వై-జంక్షన్ వద్ద ఫారెస్టు సిబ్బంది కాపు కాచి ఉన్నారు. అదే సమయంలో ఉస్తికాయలపెంట నుంచి అతివేగంగా ఓ కారు రావడాన్ని గుర్తించారు. ఆపేందుకు విఫలయత్నం చేసి వెంబడించారు. దీంతో కొంతదూరంలో కారును చెట్ల మధ్య ఆపి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కారులో పరిశీలించగా 160 కేజీల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. దాడిలో రేంజ్ ఆఫీసర్ వెంకటరమణతోపాటు సిబ్బంది మునిస్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, సదాశివయ్య, రాజేష్ కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన ఎర్రచందనంతో ఫారెస్టు అధికారులు

జీఎస్టీ, ఆదాయ పన్నులపై అవగాహన అవసరం

ఎప్పటికప్పుడు మార్పులను తెలుసుకోవాలి ● జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకూ మారుతున్న జీఎస్టీ విధానాలు, ఆదాయ పన్ను చెల్లింపుల్లో ఉన్న లొసుగులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ సూచించారు. తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో సోమవారం రాష్ట్ర, జిల్లా స్థాయి ఆడిటర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ శిరీష మాట్లాడుతూ తాను డాక్టర్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ కొత్త విధానాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ మాట్లాడుతూ ఆడిటర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు రిటర్నులు దాఖలు చేయడం, ట్యాక్స్ పే చేయడానికి అవసరమైన విధానాలపై, టెక్నాలజీపై అవగాహన పెంచుకుని సకాలంలో పన్నులు చెల్లించి దేశ, రాష్ట్ర పురోగతికి సహకరించాలన్నారు. ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, చైర్మన్ శ్రీనివాసరెడ్డి, తిరుపతి అధ్యక్షుడు సునీల్ అహ్మద్, లోకల్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, సీనియర్ ఆడిటర్ పల్గుణకుమార్, గల్లా ప్రవీణ్‌కుమార్, ఆడిటర్లు పాల్గొన్నారు.


ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శర్మ తదితరులు

ఖో-ఖో విజేతలుగా జోన్ 2ఉమెన్, 3మెన్ జట్లు


పరుగు పందెం, వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్


బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 ఉమెన్ జట్టు - బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 మెన్ జట్టు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు రెండో రోజైన సోమవారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. సాయంత్రానికి ఖో-ఖోలో తుది ఫలితాలు వచ్చాయి. మెన్ విభాగంలో జోన్ 3 జట్టు, ఉమెన్ విభాగంలో జోన్ 2జట్టు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో జోన్1 ఉమెన్, జోన్ 1మెన్ జట్లు గెలుపొందాయి. ఎస్వీయూ క్యాంపస్‌స్కూల్ మైదానంలో ఆర్చరీ, వాలీబాల్, ఎస్వీయూ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్‌హాల్లో బాక్సింగ్ పోటీలు, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, శాప్ డైరెక్టర్లు రజని, రవీంద్రనాథ్, సంతోష్‌కుమార్, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ విజేత జోన్ 2 మెన్ జట్టు, ఆర్చరి, బాక్సింగ్, కబడ్డీ

15 కేజీల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నై రహదారి సమీపంలో 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

28న అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్ మైదానంలో ఈనెల 28న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్‌రాజనందన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాలలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆరోజున ఉదయం 8గంటలకు ఆధార్, జనన ధృవీకరణ పత్రం జిరాక్సులతో తప్పనిసరిగా మైదానానికి చేరుకోవాలి. మరిన్ని వివరాల కోసం 86868 67079 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆడుదాం ఆంధ్రాకు రూ.119కోట్లు దారపోశారు

29న స్పోర్ట్స్ అకాడమీలపై ప్రకటన

శాప్ చైర్మన్ రవినాయుడు



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు రూ.119 కోట్లు కేటాయించి, దుర్వినియోగం చేశారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆరోపించారు. నిధులు పూర్తిగా పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా సోమవారం ఉదయం ఎస్వీక్యాంపస్ హైస్కూల్ మైదానంలో విలువిద్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడా అకాడమీలు రద్దు చేసిందని, వాటిని మళ్లీ ప్రారంభిస్తామని, క్రీడా పాఠశాలల సంఖ్య పెంచుతామని, ఇంటర్ వరకు మంచి శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామని వివరించారు. అమరావతి చాంపియన్‌షిప్‌లో పది క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రూ.కోటిన్నర నిధులతో క్రీడాకారులకు నాణ్యమైన పరికరాలు, సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి జిల్లాలోనూ క్రీడాకారులను గుర్తించి జోనల్, రాష్ట్రస్థాయి వరకు తెచ్చామని, విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా జాగ్రత్తపడ్డామన్నారు. ఒలింపిక్స్‌లో ఆంధ్రా క్రీడాకారులు మెడల్స్ సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ చేశామని స్పష్టం చేశారు. విజయవాడకు చెందిన విలువిద్య క్రీడాకారులు కె.ఝాన్సీలక్ష్మి, టి.భువనరాజేశ్వరి, కె.యుక్తశ్రీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఆడే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే గట్టిపోటీ ఎదుర్కొనే అవకాశం లభించిందని, తద్వారా జాతీయ స్థాయి పోటీలు సులభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి క్రీడా మైదానాలను సందర్శించారు. క్రీడాకారులతో ముచ్చటిస్తూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. కాగా ఐదు వేదికల్లో పది క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మంగళవారం అంతిమ ఫలితాలు రానున్నాయి.

పోలీసు 'పీజీఆర్ఎస్'కు 106 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 106 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో ముక్కంటి ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తన

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ సిబ్బంది తీరుతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సిబ్బంది అనుసరించిన తీరు విమర్శలకు దారితీసింది. భక్తులకు అంతరాలయ దర్శనం చేరువ చేసేందుకు రూ.500 టిక్కెట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనికోసం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద నుంచి చెక్క మెట్లపై క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కాశీ అనే ఒప్పంద ఉద్యోగి టిక్కెట్లను తనిఖీ చేస్తుంటాడు. సోమవారం కొందరు మహిళా అధికారులు అంతరాలయ దర్శనానికి వెళుతుండగా కాశీ మెట్లపై అడ్డంగా కూర్చున్నాడు. వారు పక్కకు జరగాలని కోరడంతో ఆగ్రహంతో పోతేపోండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. అలాగే కొందరు అర్చకులు హారతి పళ్లేలతో క్యూ వద్దనే అడ్డంగా నిలబడి దక్షిణ సమర్పిస్తేనే హారతి ఇస్తూ భక్తుల పట్ల కస్సుబుస్సులాడారు. అలాగే అమ్మవారి సన్నిధిలోనూ కొందరు సిబ్బంది దళారులకు రాచబాట వేస్తున్నారు. ఇక అక్కడ పనిచేసే ఓ ఉద్యోగి దురుసుగా వ్యవహరించడంపై సోమవారం పలువురు భక్తులు విస్మయం చెందారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మూడు నెలల గడువు ఇచ్చిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, సమీప ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు అధికంగా ఉన్నాయని, ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మారథాన్‌లో రామకృష్ణ ప్రతిభ


హైదరాబాదులో జరిగిన హాఫ్ మారథన్‌లో రామకృష్ణ

చంద్రగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల సీఐ రామకృష్ణ ఈనెల 24న జరిగిన మారథాన్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లో జరిగిన హాఫ్ మారథన్ పోటీల్లో ఆయన 1.45 గంటల్లో 21 కిలో మీటర్లు పరుగెత్తారు. గతం కంటే ఈసారి ఐదు నిమిషాలు ముందుగా లక్ష్యాన్ని చేరుకున్నారు. అమెరికాలోని బోస్టన్ జరిగే మారథన్‌లో పాల్గొనేందుకు రామకృష్ణ పట్టుదలతో సాధన చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో వివిధ ప్రధాన కేంద్రాలలో జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొన్నారు. బోస్టన్ పోటీలో పాల్గొనాలంటే 3 గంటల్లో 42 కిలోమీటర్లు చేరుకోవాల్సి ఉంటుందని, ఇప్పటికన్నా మరింత మెరుగుపడేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వీఆర్‌కు ఎస్ఐ గిరిబాబు

తిరుపతి(నేర విభాగం) ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఎస్ఐ గిరిబాబును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎయిర్‌బైపాస్ ఘటనలో వైఫల్యంతో పాటు పలు కారణాలతో బదిలీ చేస్తున్నట్లు ఎస్పీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన పనితీరు, వ్యవహారశైలిపై విచారణకు ఆదేశించారు.

ఎంపీడీవో కార్యాలయం ఖాళీ

కానరాని అధికారులు, సిబ్బంది



సోమవారం ఉదయం సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

తడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించే ఎంపీడీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది లేక బోసిపోతోంది. ఎంపీడీవో శిక్షణ నిమిత్తం బాపట్లకు వెళ్లగా, ఏవో సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఆరు నెలలుగా అక్కడే ఉన్నారు. ఇక ఈవోపీఆర్‌డీ అనారోగ్య కారణంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఇక కార్యాలయంలో ఉన్నది కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే. ఇలా అధికారులంతా దూరంగా ఉండటంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎవరూ కానరావడంలేదు. ఈ పరిస్థితిని గుర్తించిన జిల్లా అధికారులు నాయుడుపేట ఎంపీడీవో సురేష్‌బాబును తడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఒక్కనాడైనా ఈ కార్యాలయ ముఖమే చూడలేదు. ఏవైనా ముఖ్యమైన ఫైళ్ల క్లియరెన్స్ అవసరమైతే ఇక్కడ పనిచేసే అటెండర్ నాయుడుపేటకు తీసుకువెళ్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తడ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

చిల్లకూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పీహెచ్‌సీ వద్ద సోమవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సాలోమ్ అరాఫత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింక్ బస్సులను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజన్, లలిత్, తేజశ్విని, హరిత, పద్మావతి, సూపర్‌వైజర్ రవికుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సోమవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్‌ఎంయూఏ నాయకుడు అహ్మద్ మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ మొండి వైఖరి విడనాడాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జీఎస్ వాసులు, వెంకటేశ్వర్లు, శ్రీకళ, మస్తాన్, మల్లికార్జున, రాము, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలయ్య కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీ నాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన సుమిత్రమ్మ అనే వృద్ధురాలికి చెందిన ఇంటి స్థలంలోని హద్దురాళ్లను కొందరు తొలగించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ నిర్వహించి వృద్ధురాలికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నవకోట, మమత, సుధాకర్‌రావు, సుమిత్రమ్మ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు వైజేపీ లయన్స్‌క్లబ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆర్‌వీరావు, శ్రీనివాస్, గురునాథం, హరికృష్ణ, సుధీర్, డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



పాలకవర్గం చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అశోకపిల్లర్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏఎంసీ చైర్మన్‌గా మర్రి ప్రమీల, వైస్ చైర్మన్‌గా దువ్వూరు మధుసూదనరెడ్డి, పాలకవర్గ సభ్యులు సిద్దప్పరెడ్డి పోలమ్మ, పంత్రాంగం వసంత్, బత్తిన ప్రమీల, చల్లా స్వాతి, మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, వంకా శ్రీజ, బసవనూరు భాస్కర్, అయనబోకరి యామినీ, విన్నమాల మంజుల, కల్లూరు క్రాంతి, షేక్ మస్తాన్‌బాషా, దొడ్డుగ వెంకటరమణ, యల్లబోతు రాజగోపాల్ రెడ్డి చేత ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కోట మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో గణపర్తి కిషోర్‌నాయుడు, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, మధుయాదవ్, దారా సురేష్, రౌతు శివకుమార్, పామంజి కృష్ణయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి

కోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సుచేంద్రప్రసాద్ హెచ్చరించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో కోట, విద్యానగర్, చిట్టేడు, కేశవరం గ్రామాల్లోని ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతుకు అడిగిన వెంటనే ఎరువులను సరఫరా చేయాలన్నారు. ఎరువులు ఉండి కూడా స్టాక్ లేదని చెప్పకూడదని, అధిక ధరలకు విక్రయించినా, రైతులను ఇబ్బందులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని ఏవో హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయి కుమార్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణదారులతో మాట్లాడుతున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

ఆర్టీసీ బస్టాండ్‌లో సరుడు చోరీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ మహిళ సరుడు చోరీకి గురైనంది. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలో నివాసం ఉంటున్న నాగభూషణమ్మ సోమవారం సూళ్లూరుపేట వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ఆమె మెడలో ఉన్న రెండు సవర్ల సరుడు ఎవరో అపహరించారు. బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పంటకాలువను పునరుద్ధరించండి

నాయుడుపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీఅనంత సాగరం చెరువులోకి వస్తున్న పంట కాలువను పునరుద్ధరించాలని ఆ ప్రాంత రైతులు తహసీల్దారు రాజేంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామం నుంచి మంద బైలు ద్వారా లక్ష్మీఅనంతసాగరం చెరువులోకి వస్తున్న పంటకాలువను ఎన్‌హెచ్-71 రోడ్డు నిర్మించే సమయంలో పూడ్చివేయడంతో తీవ్ర నష్టపోతున్నామని రైతులు చెప్పారు.

చవితి వేడులకు సిద్ధమైన గణేశ్ విగ్రహాలు



అమ్మకానికి సిద్దంగా ఉన్న వినాయక విగ్రహాలు

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చవితి పండుగకు వినాయక విగ్రహాలు సిద్ధం అయ్యాయి. తయారీదారులు వివిధ ఆకృతుల్లో, ప్రత్యేక వాహనాలపై కొలువుతీరినట్లు విఘ్నేశ్వరుడి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. స్థానిక కోర్టుసెంటర్ సమీపంలోని నాలుగు తయారీ కేంద్రాల్లో వెయ్యికి పైగా వినాయక విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలను వాడవాడలా సందడిగా జరుపుకుంటుంటారు. నిర్వాహకులు పోటీపడి మరీ వివిధ రూపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాలను ఏర్పాటు చేసి 9వ రోజు వరకు విగ్రహాలకు పూజలు నిర్వహించి గ్రామోత్సవం జరిపి నిమజ్జనానికి తరలించి వేడుక చేసుకుంటారు. ఈ నేపథ్యంలో పట్టణంలో నాలుగు నెలల నుంచి కళాకారులు విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు వివిధ ఆకృతుల్లో ప్రత్యేక ఆకర్షణ ఉండేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు. విగ్రహాలు రూ.3 వేల నుంచి రూ.70 వేల వరకు విక్రయిస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. ఈ ఏడాది విగ్రహాల తయారీకి అవసరమైన ముడి సరకులు, కూలీల ఖర్చులు పెరగడంతో గతేడాదితో పోలిస్తే ఈసారి 20శాతం వరకు ఖర్చులు పెరిగిందని తయారీదారులు చెబుతున్నారు. గూడూరు పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులు తమకు నచ్చిన విగ్రహాలను ముందుగానే కొనుగోలు చేసేందుకు వస్తుండడంతో దుకాణల వద్ద పండుగ వాతావరణం సంతరించుకుంది.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం: పాశం



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు పారదర్శక పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంబంధించిన ఆస్తుల పాస్‌పుస్తకాలు, రేషన్ కార్డులపైన సీఎం ఫొటోలు ముద్రించారని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డుల మీద ఎవరి ఫొటోలను వేయలేదని, రాజ్యాంగ బద్ధంగా పాలన సాగిస్తోందన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తూ ముందుకు వెళుతోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు పెద్దపీట వేశారన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ పేదలందరికీ రేషన్ సరుకులను పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల అందజేస్తోందని, దీనివల్ల అక్రమాలను అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు ప్రసాద్, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, భారతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత: విజయశ్రీ



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్ట చౌకదుకాణంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ సరుకులను తీసుకోవడంలో లబ్ధిదారుల సమస్యలను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను రూపొందించి అందజేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా రేషన్ కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపైనా ఫొటోలు ముద్రించకుండా ప్రభుత్వం లోగోతో అందజేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళలకు ఉచిత సిలిండర్, బస్సు ప్రయాణం, తల్లికి వందనం లాంటి పథకాలు ప్రవేశపెట్టి మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, మేడా సాయి, బీజేపీ నాయకురాలు బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి



స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్, టీడీపీ నాయకులు రఫీతో కలసి స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా పీడీకి సన్మానం



పెంచలయ్య సత్కరిస్తున్న మెప్మా సిబ్బంది

గూడూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మా సిటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పెంచలయ్య పీడీగా పదోన్నతి పొందడంతో సోమవారం స్థానిక మెప్మా కార్యాలయంలో సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భూములను మార్కెట్ యార్డుకు అప్పగించండి

సూళ్లూరుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామంలో సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు కేటాయించిన భూములను వెంటనే అప్పగించాలని సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, దొరవారిసత్రం మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసుల నాయుడు సోమవారం ఆర్డీవో కిరణ్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏకొల్లు గ్రామ సర్వే నెంబరు 61-బి1లో 2.89 ఎకరాలు, సర్వే నెంబరు 61-2లో 0.11 సెంట్లు మొత్తం 3 ఎకరాలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు కేటాయించారని, ఆ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించి అప్పగించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బాలాయపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సంగవరం, బాలాయపల్లి గ్రామాల్లోని ఎరువుల దుఖాణాలను తిరుపతి జిల్లా విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వ, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖాధికారి విజయలక్ష్మి, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్ దుకాణ యజమానులు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సుజాత, సీఐ రమణ హెచ్చరించారు. సోమవారం వారు ఎరువుల దుకాణలను తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కోలా ఆనంద్‌కు అభినందనలు

వెంకటగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమితులైన కోలా ఆనంద్‌కు వెంకటగిరి శ్రీకృష్ణ దేవరాయ కాపు, బలిజ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం శ్రీకాళహస్తిలోని కోలా ఆనంద్ నివాసంలో ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట కృష్ణయ్యతో పాటు కాపు, బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

వెంకటగిరి టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లమ్మ గుడి వీధిలోని ఎస్టీ కాలనీ వద్ద సోమవారం బాల్యవివాహాల నిర్మూలనపై న్యాయవాదులు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో గాంధీ, రెంటాల వాసు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



ప్రసాద్ నాయుడిని సత్కరిస్తున్న పునుగోటి విశ్వనాథం

బాలాయపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరు ప్రసాద్ నాయుడు ఏఎంసీ డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతల స్వీకరించారు. ఆయనను టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



పాలక మండలి చైర్మన్, సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఈవో మమత, ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో నాగేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి స్వీకారోత్సవం ఈవో మమత అధ్యక్షతన సోమవారం జరిగింది. చైర్మన్‌గా తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, సభ్యులుగా పట్టుపల్లి మోహన్, పోలూరు లీలా మోహన్, చిట్టేటి మధు, మాటిరెడ్డి బేబీ, వెంటక నాగ పరిమళ, మామండూరు శాంతి, పొల్లమాల సుమతి, పల్లేటి ఆనంద నాయుడుతో ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు సురేంద్ర రెడ్డి, ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న తహసల్దారు శ్రీనివాసులు, ఎంపీపీ రాజశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి

దక్కిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తహసీల్దారు శ్రీనివాసులుతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందచేశారు. ఈ సదర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు వల్ల రేషన్ సరుకులు పొందిన, తీసుకోని వారి వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో లోపాలను సరిదిద్దేందుకే స్మార్ట్ కార్డులు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ 1నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ దుకానానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

తడ: మండలానికి ప్రభుత్వం సరఫరా చేసిన 14,221 స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ శరత్‌బాబు రేషన్ డీలర్లకు అందజేశారు. సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు, రేషన్ డీలర్లు సోమవారం నుంచి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయడం ప్రారంభించారు.

బాలాయపల్లి: రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మి పంపిణీ చేశారు. మండలానికి 10,758 కార్డులు మంజూరు కాగా, మొదటిరోజు 768 కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలానికి ప్రభుత్వం సరఫరా చేసిన 14,221 స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ హరికృష్ణ రేషన్ డీలర్లకు అందజేశారు. వాటిని సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మధుయాదవ్, దారా సురేష్, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


గురువులను గౌరవించాలి



ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గురువులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పుతూ ప్రతినిత్యం ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా ప్రగతి సేవాసంస్థ ముందుకు వచ్చి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కరిముల్లా, దశరథ రామిరెడ్డి, ఎన్‌వీరత్నం, పిళ్లెళ్ల శ్రీనివాసులు, పేటేటి ప్రకాశ్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ



హోమపూజల్లో భక్తులు

చిల్లకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కామాక్షమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ముందుగా ఆలయంలో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవాకిఇ విగ్రహానికి విశేష పూజులు జరిపి ప్రతిష్ఠించారు.

ఎంపీడీవో తీరుపై టీడీపీ విమర్శలు

పెళ్లకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి నిర్ణయాలు సరికావని టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, వేలూరు మురళీకృష్ణారెడ్డి, కందమూడి శివకుమార్, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి తదితరులు ఎంపీడీవోతో సమావేశమయ్యారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయశ్రీకి, టీడీపీ నాయకులకు దూరం పెంచే ప్రయత్నం ఎంపీడీవో చేస్తున్నారని ఆరోపించారు. జీలపాటూరు సర్పంచు శివకుమార్ మాట్లాడుతూ మా పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధులు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఆ వినతిపత్రం కలెక్టరేట్ నుంచి డ్వామాకు అక్కడ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి రాగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు లేవని ఎంపీడీవో తనకు లెటర్ రూపంలో ఇవ్వడం సరికాదన్నారు. తమ గ్రామాభివృద్ధిని ఎంపీడీవో అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కాటూరు గోపాల్‌రెడ్డి, కలవకోలు మునీష్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ ఏటీఎం కార్డుల దొంగ

రూ.40 వేలు రికవరీ



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏటీఎం సెంటర్‌కు వచ్చే వినియోగదారులను ఏమార్చి కార్డులు చోరీ చేస్తున్న దొంగను సత్యవేడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాలు.. మండలంలోని కన్నవరానికి చెందిన రవి ఈనెల 18న సత్యవేడు ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం సెంటర్‌కు నగదు డ్రా చేసుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని సాయం అడిగి నగదు డ్రా చేసుకున్నాడు. అయితే సాయంత్రానికి తన అకౌంట్ నుంచి తన ప్రమేయం లేకుండా డబ్బు డ్రా అవుతున్న విషయాన్ని గుర్తించి మోసపోయానని గ్రహించాడు. తన ఏటీఎం కార్డును ఆ గుర్తు తెలియనివ్యక్తి దొంగిలించాడని గ్రహించి లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ మురళి ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు నిందితుడి కోసం గాలించాయి. దొంగిలించిన ఏటీఎంతో నిందితుడు చిత్తూరులోని ఓ ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేశాడని రవి ఫోన్‌కు మెసేజ్ రావడంతో అక్కడకు చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దాని ఆధారంగా నిందితుడు ఏర్పేడు మండలం కందాడు గ్రామానికి చెందిన మునిసుబ్రమణ్యం (40)గా గుర్తించి అదుపులో తీసుకున్నారు. విచారణలో నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా నిందితుడు మునిసుబ్రమణ్యం బీటెక్ వరకు చదువుకుని ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇతనిపై శ్రీకాళహస్తి, ఏర్పేడు, గాజులమండ్యం, వడమాలపేట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనాయి. ఏఎస్‌ఐ చంద్రశేఖర్, ప్రతాప్, హరి, హనుమంతయ్య పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్లపై కేసు నమోదు

ఏర్పేడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిందేపల్లిలో కోడిపందేల స్థావరాలపై ఆదివారం సాయంత్రం డ్రోన్ కెమెరాతో గుర్తించి దాడి నిర్వహించిన విషయం విదితమే. ఈ దాడిలో రూ.61,116, 29 మొబైల్‌ఫోన్లు, 30 బైకులు, 11 కోడిపుంజులు, 12 కోడికత్తులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. వాటితో పాటు 32మంది పందెంరాయుళ్లను రేణిగుంట డీఎస్పీ శ్రీనివసరావు, ఏర్పేడు పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఉంచి సోమవారం ఉదయం 11 గంటలకు సొంత పూచికత్తుపై వదలిపెట్టారు. మొబైల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు, కోడికత్తులను శ్రీకాళహస్తి కోర్టుకు స్వాధీనం చేశారు. కోర్టులో చలానా కట్టి వస్తువులు తీసుకోవాలని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు.

ఎస్పీ సీరియస్!

ఏర్పేడు పోలీసు సిబ్బందిపై తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజు సీరియస్ అయినట్లు తెలిసింది. మండలంలోని చిందేపల్లి వద్ద గత కొద్ది రోజులుగా కోడిపందేలు జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇటు ఐఐటీ, అటు ఐసర్ వంటి కేంద్రీయ విద్యాసంస్థలు సమీపంలో ఉన్న గ్రామంలో ఇలాంటి పందేలుల జరగడంపై మండిపడ్డారని విశ్వసనీయ సమాచారం. డ్రోన్ కెమెరా గుర్తించే దాకా పోలీసు సిబ్బంది ఏం చేస్తున్నట్టు ప్రశ్నించినట్టు తెలిసింది.

వ్యక్తిత్వ నిర్మాణంలో పెంపకమే కీలకం

ఏర్పేడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వర్తమాన సమాజంలో జరుగుతున్న అనేక సామాజిక సమస్యలకు పెంపకం లోపమే కారణమని ప్రముఖ సైకలాజిస్టు డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో పిల్లల పెంపకంలో తల్లిపాత్రపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యక్తిత్వ నిర్మాణంలో పెంపకమే కీలకమన్నారు. తల్లి తొలి గురువు, తండ్రి మార్గ దర్శి ఇల్లు వికాస క్షేత్రం కావాలని సూచించారు. బాల్యం నుంచి మానవత్వం, కుటుంబం, సామాజిక సంబంధాలు, నైతిక విలువలు, ఏకాగ్రతను నేర్పించాలన్నారు. ఇన్‌చార్జి సత్యనారాయణ, సహోద్యోగి మునిరత్నం, సంస్థ యానిమేటర్లు, 100 మంది మహిళలు పాల్గొన్నారు.

కార్గో సెంటర్ తరలింపు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌లోని శ్రీహరి బస్టాండులో కొంత భాగం మరమ్మతుల కారణంగా 1నుంచి 5వరకు ప్లాట్‌ఫామ్స్ కూల్చివేయనుండడంతో ఆర్టీసీ కార్గో కేంద్రాన్ని మరో రెండు ప్రాంతాలకు తరలించారు. ఏడుకొండల బస్టాండు వద్ద టీటీడీ కౌంటర్‌లో పార్సిల్స్ డెలివరి, డీపీటీవో కార్యాలయం కింద ఉన్న దుకాణం గదుల్లో పార్సిల్స్ బుకింగ్ కౌంటర్లను సోమవారం డీపీటీవో జగదీష్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. వినియోగదారులు ఈ మార్పులను గమనించాలని ఆయన కోరారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

వరదయ్యపాళెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబూరులో కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం స్వామి అమ్మ వార్లకు విశేష పూజలు నిర్వహించి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను చప్పరంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఎన్‌ఆర్‌ఐ నందకిషోర్ రెడ్డి పర్యవేక్షించారు.

పుత్తూరు వార్తలు

పేదల కోసమే స్మార్ట్ రేషన్‌కార్డులు

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



స్మార్ట్ రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నివిధాల ఉపయోగపడేలా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. సోమవారం వడమాలపేటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డుల్లో తప్పులుంటే సరిదిద్దడానికి అవకాశం ఉందన్నారు. మండలానికి 9,506 స్మార్ట్‌కార్డులు వచ్చాయని, ఇంటి వద్దే కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయులు నాయుడు, దాముయాదవ్, ఢిల్లీ ప్రసాద్, లక్ష్మీప్రసన్న, శివరాయల్, కుమార్, గురునాధం శెట్టి, జానార్ధన్, బత్తినాయుడు, హేమావతి, భాస్కర్, తహసీల్దార్ జరీనా, సీఎం డీటీ హరికృష్ణ, ఆర్‌ఐ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



వడమాలపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించారు. ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు అభయ హస్తాధీశుడి ఆలయ చరిత్రను న్యాయమూర్తికి వివరించారు. ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు నేడు ఆఖరి రోజు

పుత్తూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 26న మంగళవారం చివరి రోజని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. కళాశాలలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

గిరి బలిజ జీవో రద్దు చేయాలి

పుత్తూరు టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గిరి బలిజల జీవోను రద్దు చేయాలని బలిజ సేవా సంఘం నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొమ్మర కులస్థులను బలిజ కులస్తులుగా చేరుస్తూ ప్రభుత్వం జీవో 179 చేయడం విచారకరమని తెలిపారు. శ్రీరామ్, గోపీ, కృష్ణయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని దళిత సంఘ నాయకుడు నందయ్య కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణమని తెలిపారు. భాస్కర్, చిట్టిబాబు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

29న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈనెల 29న శుక్రవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలోని కొట్టు మండపంలో ఉదయం 7 గంటల నుంచి జరిగే లెక్కింపు కార్యక్రమానికి ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు.

స్మార్ట్‌కార్డుతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు



స్మార్ట్ రేషన్ కార్డును పంపిణీ చేస్తున్న బొజ్జల బృందమ్మ, చెంచయ్యనాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డుతో రాష్ట్రంలో ఎక్కడైనా నిత్యావసర సరుకులు తీసుకోవచ్చని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ చెప్పారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని రేషన్ దుకాణం వద్ద స్మార్ట్ రేషన్‌కార్డులను ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డితో కలిసి కార్డుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్డును చూపి మహిళలు బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. రేషన్ దుకాణంలో వేలిముద్రలు పడని వారికి ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, కాసరం రమేష్, గుర్రప్పశెట్టి, రేషన్ డీలర్ వివేక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తొట్టంబేడు మండలం చేమూరులో కార్డుదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, నాయకులు చంద్రారెడ్డి, రమేష్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. అక్కుర్తిలో కూడా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న జీలగలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గ వీధిలోని చౌక దుకాణం వద్ద ఎంపీడీవో ప్రభురావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీటీ శామ్ టీడీపీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేవారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మెహబూబ్ బాషా, మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, నాదముని రెడ్డి, బుజ్జి నాయుడు, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఏవో మురళీకృష్ణకుమార్, రాయపేడు సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, రమేష్, అయ్యప్ప, శివరావు, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తహసీల్దారు భార్గవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు, ధనంజయులునాయుడు, శివశంకర్‌రెడ్డి, మోహనరావు, గాలి కృష్ణవేణి, గుణయాదవ్ తదితరులు పాల్గొని కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పాపానాయుడుపేటలో టీడీపీ నాయకులు కృష్ణప్ప మొదలియార్, అర్జున్‌బాబు, రోశయ్య ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండల కార్యాలయంలో కార్డుదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, ఎంపీడీవో అరుణ, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లు తొలగించేస్తున్నారంటూ వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. సోమవారం సత్యవేడు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఎంపీడీవో త్రివిక్రమరావు, డీటీలు వెంకటేశ్వర్లు, త్యాగరాజు, ఆర్‌ఐ సురేష్ నాయకులు వెంకటరమణ, రాజ, వెంకటేశ్వర్లు, మోహన్‌బాబు, తెలుగుమహిళ కావేరి, డీవీఎంసీ గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మునిభూషణమ్మ, జయశంకర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు దిలీప్ రాయల్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి తడ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన 20 ఏళ్ల నిరీక్షణ

గ్రామానికి దారి ఏర్పాటు



ఎక్స్‌కవేటర్ సాయంతో బావి పూడ్చి వేత

కేవీబీపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశం గ్రామంలో 40 కుటుంబాల వారు 20 సంవత్సరాలుగా దారి లేక నానా ఇబ్బందులు పడ్డారు. ఆ దారిలో ఎప్పటి నుంచో ఉన్న నిరుపయోగంగా ఉన్న బావి అడ్డం రావడంతో ఏర్పాటుకు ఆటంకం ఏర్పడింది. ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు త్వరితగతిన దారి ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో స్పందించిన తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి చొరవతో సర్వే నిర్వహించి సోమవారం దారి ఏర్పాటుకు పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేను పక్కా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సచివాలయ సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కుమార వెంకటాపురం, చిన్నాయగుంట, తిమ్మభూపాలపురంలలో రీ సర్వే పూర్తైందన్నారు. రెండోవ విడతలో తెర్రిపాడు, చల్లమాంబపురం, తంగేళ్లపురం, నీర్పాకోట, తలారివెట్టు, వీఎస్‌పురం, తలారివెట్టు, వీఎస్‌పురం, కంచనపుత్తూరు, కనమనంబేడు, బీఎస్‌పురంలలో సర్వేను చేయాల్సి ఉందన్నారు. ఈ గ్రామాల్లో హద్దులు గుర్తించిన తరువాత సర్వే చేపట్టాలన్నారు. రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలన్నారు.

క్వారీ, క్రషర్ యజమానులకు నోటీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, పట్టాభి గిరిజన కాలనీలో రోడ్లు ధ్వంసం కావడానికి కారణమైన క్వారీ, క్రషర్ యజమానులకు నోటీసులు జారీ చేయాలని కార్యదర్శి పెంచలయ్యకు ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆదేశించారు. తమ గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని శనివారం ఆలత్తూరు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. రోడ్డును పరిశీలించడంతో క్వారీలు, క్రషర్‌ల నుంచి భారీ లారీలు రాకపోకలతోనే రోడ్డు ధ్వంసమైనట్టు గుర్తించారు.

కాలువలోకి దూసుకెళ్లిన టిప్పర్



వరదయ్యపాళెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. స్థానిక కంకర క్వారీల నుంచి కంకర తరలిస్తున్న టిప్పర్ సోమవారం వీకేఆర్‌పై కాలనీ సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి పక్కనే ఉన్న చెరువు కట్టవద్ద ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. టిప్పర్ ఖాళీగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఈ మార్గంలో తరచూ టిప్పర్లు అతివేగంతో అదుపు తప్పుతున్నాయి.

పింఛన్ల రద్దుపై నిరాధార ఆరోపణలు

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



బీఎన్‌కండ్రిగలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు రద్దు చేశారంటూ వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం కార్డుదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచారణ జరిపిన అనంతరం అనర్హులకు నోటీసులు జారీ చేశారన్నారు. సదరం సర్టిఫికెట్ తెచ్చుకుంటే పింఛను ఇస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా దొంగ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు పొందుతుండడంతో విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అర్హులైన దివ్యాంగులకు రద్దైతే తాను బాధ్యత తీసుకుని పింఛను ఇప్పిస్తానని చెప్పారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రవి, సర్పంచ్ వెంకటరత్నమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన కమిటీలకు అవగాహన



రేణిగుంట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే కమిటీలకు పోలీసులు అవగాహన కల్పించారు. సోమవారం ప్రైవేటు హాలులో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు నిర్వహించుకోవాలని, ఊరేగింపు రోజు ఘర్షణలకు తావివ్వ కూడదని కమిటీలకు సూచించారు. సీఐ జయచంద్ర, కానిస్టేబుళ్ల తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు?

వింగ్ టెక్ పరిశ్రమ ముందు కార్మికుల ధర్నా



పరిశ్రమ ముందు బైఠాయించిన కార్మికులు

రేణిగుంట/ ఏర్పేడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వింగ్ టెక్ పరిశ్రమ ముందు కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. సోమవారం ఉదయం విమానాశ్రయం సమీపంలోని కార్బన్ పరిశ్రమ అనుబంధ సంస్థ వింగ్‌టెక్‌లో పనిచేస్తున్న కార్మికులు ప్రధాన ద్వారం వద్ద యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాజమాన్యం మారడంతో ఒక్కసారిగా 205 మందిని తొలగిస్తున్నామనడం భావ్యం కాదన్నారు. వింగ్‌టెక్ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మికులు సోమవారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. నోటీసులు ఇవ్వకుండా కార్మికులను తొలగించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. వింగ్ టెక్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. చైనాకు చెందిన వింగ్ టెక్ యాజమాన్యం ఆరేళ్ల కిందట ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదని, ప్రకటించిన పెట్టుబడులు పెట్టకపోగా పూర్తిస్థాయి రాయితీలు పొందిందన్నారు. అయితే లాభాలు గడించినప్పటికీ పన్నులు చెల్లించకుండా కార్మికులకు తొలగించిందని పేర్కొన్నారు.

సైనికులు దేశగౌరవాన్ని పెంచారు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తిరుమల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనికులు, భద్రతాసిబ్బంది వీరోచితమైన ప్రదర్శన చేసి దేశ గౌరవాన్ని పెంచారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం సుప్రభాత సేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దేశపరిరక్షణలో అంకితభావంతో పనిచేస్తున్న సైనికులకు అండగా ఉండాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్టు ఆయన తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాది రాజేశ్వరరావు అన్నారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ప్రయాణికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

శాంతారాం పవార్‌కు నివాళి



శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో మరపురాని మనిషి శాంతారాం పవార్ అని పలువురు అన్నారు. సోమవారం ఆయన 72వ జయంతిని పురస్కరించుకుని ది స్కూల్ ఆవరణలో ఆయన కుమార్తె డాక్టర్ అర్చన, సోదరులు జనార్దన రావు పవార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి ఛైర్మన్‌గా, పురపాలకసంఘ ఛైర్మన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విశాల, ముకుందరావు పవార్, దయారామ్ పవార్, శివశంకర్‌రావు పవార్, పడోల్కర్ మహేశ్వరరావు, సదా రాం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీఎం జోషి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.